
దిన పత్రిక తొలి సమయం

బుధవారం । 29 । జూలై । 2026

# హైడ్రా తీర్పుతో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

**- బిజెపి రాష్ట్ర నాయకులు..**

**లేగా రాంమోహన్ రెడ్డి**



తొలి సమయం-తొర్రూరు జులై 28:
హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బ్రేక్ వేసిందని, హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను తొలగించాలని ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు లేగా రాంమోహన్ రెడ్డి అన్నారు.తొర్రూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారము నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రవాసీ యోజన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియంత పాలన చేస్తోందని ఆరోపించారు. పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చడం దుర్మార్గమని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన 15 వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలను చెల్లించడం లేదని తెలిపారు. విద్యార్థులకు డబ్బులు ఇవ్వలేని ప్రభుత్వం అధికారంలో ఉండటానికి అర్హత లేదని, ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పంజాబ్, కేరళ, తెలంగాణ విద్యార్థి ఉద్యమాలను పట్టించుకోకుండా ఢిల్లీ నిరసనలకు మాత్రమే మద్దతు ఇవ్వడం కాంగ్రెస్ కుట్ర రాజకీయమని అన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తుల కుట్రలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఛేదిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఎస్ఐఆర్ పై అపోహలు సృష్టిస్తున్న కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు ప్రజలు గుణపాఠం చెబుతారని, ప్రజలు స్వచ్ఛందంగా ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమం అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ న్యాయ సెల్ నాయకుడు గంధం రాజు ను పరామర్శించారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ నాయకులు చలువాది సత్యనారాయణ, మంగళపల్లి యాకయ్య, సిహెచ్. విజయ్ కుమార్, నూకల నవీన్, కాసోజు శ్రీనివాస్ చారి, కొండపల్లి శ్రీనివాస్, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లి మండలం కాల్వపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల రీ సర్వే




తొలి సమయం-దంతలపల్లి జులై 28
మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి మండలం కాల్వపల్లి గ్రామంలో మంగళవారం ప్రభుత్వ భూముల రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలో మొత్తం 70 గ్రామాలను రీ సర్వేకు ఎంపిక చేయగా, ఇప్పటికే 11 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారము కాల్వపల్లి గ్రామంలో ఆబాది, ప్రభుత్వ భూముల గుర్తింపు, కాలువలు, రోడ్లు, చెరువులతో పాటు ఇతర ప్రభుత్వ స్థలాల హద్దులను నిర్ణయించేందుకు సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇచ్చిన సూచనల ప్రకారం ప్రభుత్వ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్ల ద్వారా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం సూచించిన గడువులోగా సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్బన్ భూ గరిష్ట హద్దుల అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. శ్రీనివాసులు, తహసిల్దార్ సునీల్ రెడ్డి, సర్వేయర్ శ్రీ నిత్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

**- లిక్కర్, 10 లీటర్ల గుడుంబా స్వాధీనం..**

**- 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**




తొలి సమయం మహబూబాబాద్, 28 జూలై 2026
మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో మంగళవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శభరిష్. పి, ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ తిరుపతిరావు సూచనలతో టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా కాలనీలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమతి లేకుండా బెల్ట్ షాప్‌లో నిల్వ ఉంచిన లిక్కర్‌తో పాటు అక్రమంగా నిల్వ చేసిన 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గుడుంబా తయారీకి ఉపయోగించే సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ వ్యవహారాలకు సంబంధించి పలు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.అదేవిధంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 10 వాహనాలను గుర్తించి వాటిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నారు.అనంతరం టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి కాలనీ వాసులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం, కాలనీ భద్రతకు సీసీ కెమెరాల ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. కాలనీలో ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగినా, గంజాయి, గుడుంబా తదితర మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, నేరాల నియంత్రణకు అవగాహన కల్పించడమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

## నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు

**12 మందిపై కేసులు నమోదు.. 41 లీటర్ల నాటుసారా,**

**50 కిలోల బెల్లం స్వాధీనం**



తొలి సమయం మహబూబాబాద్, 28 జూలై 2026
నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ అధికారులు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, -మహబూబాబాద్, వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా డోర్నకల్ మండలంలోని తెల్లబండ తండా, గార్ల మండలంలోని బుద్ధారం, అంజనాపురం గ్రామాల్లో దాడులు చేపట్టాయి.ఈ దాడుల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 41 లీటర్ల నాటుసారా, 50 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం కేసుల్లోని నిందితులను సంబంధిత గార్ల, డోర్నకల్ తహసీల్దార్ల ఎదుట బైండ్ ఓవర్ చేశారు.కేసులు నమోదైన వారి వివరాలు:అంజనాపురానికి చెందిన ధరావత్ అచ్చమ్మ, బానోతు మల్కి, భూక్య చిల్కి, ఇస్లావత్ మున్యా, భూక్య రవి; బుద్ధారానికి చెందిన భూక్య చందు, బానోతు భారతి, భూక్య నాగమణి, భూక్య పద్మ; తెల్లబండ తండాకు చెందిన బోడ కాంతి, తేజావత్ బుజ్జి, గుగులోతు కైలా ఉన్నారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు జి. చిరంజీవి, కె. నాగయ్య, సీహెచ్. నాగేశ్వరరావు, సీహెచ్. నీరజ, జి. చంద్రశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్. కిరీటి, జి. మౌనిక, ట్రైనీ ఎస్ఐలు ఎన్. ధనలక్ష్మి, డి. నాగ అమృతతో పాటు హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, సంపూర్ణ, హరీష్, జాన్ పాషా, బలరాం, లాలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం



**వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ**

**కార్యక్రమం ముగింపు..**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన**

**మహిళా సభ్యులకు బహుమతులు**

తొలి సమయం కొత్తగూడ, 28 జూలై 2026
గ్రామాల సమగ్ర అభివృద్ధిలో వార్డు సభ్యులు క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని ఎంపీడీవో సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ల ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగూడ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది.జూలై 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు శిక్షకులు (లు), పంచాయతీ కార్యదర్శులు సయ్యద్ అలీ, రామారావు, వినోద్ పాల్గొని వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా వార్డు సభ్యులకు ప్రశ్నపత్రం నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది మహిళా వార్డు సభ్యులను ఎంపీడీవో అభినందించి బహుమతులు అందజేశారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వార్డు సభ్యులందరికీ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 2026కు సంబంధించిన గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు అన్ని వార్డుల్లో సమర్థవంతంగా అమలయ్యేలా వార్డు సభ్యులు ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని అధికారులు సూచించారు.గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో వార్డు సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## గిరిజన గ్రామ పంచాయతీలకు ఉచిత స్ప్రే పంపుల పంపిణీ




**- ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ చొరవతో యూనియన్ బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు**

తొలి సమయం కొత్తగూడ: 28 జూలై 2026
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ చొరవతో యూనియన్ బ్యాంక్ సిఎస్ఆర్ నిధుల ద్వారా కొత్తగూడ మండలంలోని గ్రామ పంచాయతీలకు ఉచిత స్ప్రే పంపులను అందజేశారు. గ్రామ పంచాయతీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.కొత్తగూడ మండలంలోని గుంజేడు, రేణ్యా తండా, ముస్మి, బత్తుల్లపల్లి, కోనాపురం, చెరువు ముందు తండా, కొత్తపల్లి, కార్లయి గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు యూనియన్ బ్యాంక్ అధి కారి బాలాజీ చేతుల మీదుగా స్ప్రే పంపులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొని మాట్లా డుతూ గ్రామ పంచాయతీలకు అవసరమైన పరికరాలను నిధుల ద్వారా అందించడం అభినందనీయమన్నారు. ఈ స్ప్రే పంపులు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ, ప్రజారోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా సిఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేయడం ద్వారా మరిన్ని గ్రామ పంచాయతీలకు సహాయం అందించాలని నాయకులు ఆకాంక్షించారు.

## వసతి గృహం (హాస్టల్) ఏర్పాటు చేయాలని డిమాండ్




**గుడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఆందోళన**

**డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా మరియు రాస్తారోకో**

తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026
గుడూరులో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సమస్యలపై ఉద్రిక్తత నెలకొంది. వసతి గృహం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను నిరసిస్తూ డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు.ఆందోళనను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించినప్పటికీ, విద్యార్థులు తమ డిమాండ్లపై వెనక్కి తగ్గేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు.ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గుడూరు ప్రాంత విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద, గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వం తక్షణమే కళాశాల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో మానుకోట ఎమ్మెల్యే మురళి నాయక్ క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు.

## గూడూరులో ఖాళీ ప్రదేశాలు, రోడ్ల వెంట కలుపు నివారణ మందు పిచికారీ



తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026
గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పరిరక్షణలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలు, ఇళ్ల పరిసరాలు, రోడ్ల వెంట పెరిగిన గడ్డిపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కలుపు నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు.గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్ల వెంట గడ్డి, పిచ్చి మొక్కలు అధికంగా పెరగకుండా చర్యలు తీసుకుంటూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఇనుముల యాకాంబరం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు షాజహాన్, యాదగిరి, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి చిన్నారి ఆసుపత్రిలో.. ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026
నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడి వైద్య చికిత్సకు దాతల సహాయం కోరుతున్న కుటుంబ సభ్యులుకొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని రేణ్యా తండా గ్రామపంచాయతీ పరిధి ఓటాయి తండాకు చెందిన బోడ రోహిత్ (4వ తరగతి) అనే చిన్నారి ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఆడుకుంటూ అనుకోకుండా గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రోహిత్ కుటుంబం అత్యంత నిరుపేద కుటుంబమని, హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య ఖర్చులు భరించడం కుటుంబానికి భారంగా మారడంతో దాతలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి చిన్నారి ప్రాణాలను కాపాడాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.సహాయం చేయదలచిన వారు:పేరు: ఫోన్/చెల్లింపు నంబర్: 9133635022 చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం చేసిన స్నేహితులు సంబంధిత వారికి స్క్రీన్‌షాట్ పంపించాలని విజ్ఞప్తి చేశారు.

దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
బుధవారం । 29 । జూలై । 2026

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి

### న్యాయపరమైన సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి: న్యాయవాదులు




**తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026**
ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని, తమ హక్కులను తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో న్యాయవాదులు సూచించారు. గంగారం మండలంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు పాల్గొని ప్రజలకు వివిధ చట్టాలు, న్యాయపరమైన అంశాలు, పౌరుల హక్కులు, అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా న్యాయబద్ధమైన మార్గాలను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ పరిరక్షణ, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే సేవలు తదితర అంశాలను వివరించారు. ఆర్థిక స్థోమత లేని వారు కూడా అవసరమైన సందర్భాల్లో ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, చట్టబద్ధమైన మార్గంలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**తొలి సమయం, వనపర్తి జులై 28**
ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు శ్రీహరి. ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ. తెలంగాణ రాష్ట్ర ఆటో & ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ఆటో రంగా కార్మికులను సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని మంగళవారం వనపర్తి జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి సురేష్ కుమార్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ. ఆర్.టి.ఎ. ఆఫీసులలో ఆటోలకు రేడియం స్టిక్కర్లు మినహాయించాలని. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు వెంటనే పెంచాలని. అదేవిధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా లో అక్రమంగా ఓలా, ఊబర్, రాపిడో ద్వారా నడుస్తున్న టూ వీల్లర్లను వెంటనే నిషేధించాలని ఓలా, ఊబర్, రాపిడో స్థానంలో ప్రభుత్వమే ఒక యాప్ ను కేరళ మాదిరిగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న యాక్సిడెంట్ బీమాను పునరుద్ధరించాలని. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ. 12,000/-లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఛాలన్లను ఆటోలకు మినహాయించాలి.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆటో డ్రైవింగ్ లైసెన్స్ సారధి వాహన పోర్టల్లో ఆటో లైసెన్ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ. ఆటో యూనియన్ నాయకులు మహేష్. మధు. బాలకృష్ణ. చక్రవర్తి. సురేష్. తదితరులు పాల్గొన్నారు.

## 11వ అఖిలభారత ఓబీసీ మహాసభను జయప్రదం చేయాలి



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 28**
11 వ అఖిల భారత ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని, జిల్లా లోని ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొనాలని, తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం మహబుబాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు దొంతోజు ఓంకార్ పిలుపునిచ్చారు ,మహబుబాబాద్ జిల్లా లోని వివిధ కార్యలయాలు శిక్షణ శిబిరాలు సందర్శించి, బిసి ఉద్యోగులు లను కలిసి ఆగస్టు 7 వ తేదీన బెంగుళూరు లో జరిగే ఓబిసి జాతీయ మహ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, బిసి ల ఐక్యత సమస్యల సాధనకు పోరాడాల్సిన ఆవశ్యకత ను వివరించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లి విద్యాసాగర్ చంద్రశేఖర్ తూడివెంకటేష్ శివప్రసాద్ కురలి మండల అధ్యక్షుడు గందసిరి మురళి మహబుబాబాద్ మండల అధ్యక్షుడు రఫిక్ తదితరులు పాల్గొన్నారు

## యశోద ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన బానోత్ హరిప్రియ నాయక్



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 28:**
గుండె సంబంధిత సమస్యతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సతీమణి పెద్ది స్వప్న రెడ్డిని ఓదార్చి, సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ, మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మహబూబాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం వివాదాల్లో మాకుల క్షేత్రం: జాదవ్ రమేష్ నాయక్



**తొలి సమయం, మహబూబాబాద్/మరిపెడ, జూలై 28:**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ప్రసిద్ధ మాకుల భావసంగ్ బావామ్యారామా భవానీ ఆలయం నిత్యం వివాదాల కేంద్రంగా మారుతోందని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో పాటు భక్తుల నుంచి సేకరించిన విరాళాల వివరాలను ఇప్పటికీ బహిర్గతం చేయలేదన్నారు. ఆలయ భూముల దాతల పేర్లు, భక్తుల విరాళాల లెక్కలను పారదర్శకంగా ప్రకటించి శిలాఫలకాలపై చెక్కించాలని డిమాండ్ చేశారు. ఆలయ అధికారుల అనుమతి లేకుండా, రసీదులు ఇవ్వకుండా కొందరు అర్చకులు భక్తుల నుంచి నగదు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై దేవాదాయ శాఖ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఒక అర్చకుడిపై మరో అర్చకుడు భౌతిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆలయ పరిపాలనలో నెలకొన్న పరిస్థితులు బయటపడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆలయంలో హుండీలో కాకుండా నేరుగా భక్తుల నుంచి నగదు సేకరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. ఆలయ సమీపంలోని భూముల ఆక్రమణలపై కూడా ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో గిరిజన లంబాడీలకు ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన మాకుల క్షేత్ర ప్రతిష్ఠ దెబ్బతినకుండా దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మరిపెడ పరిధిలో ఉచిత వైద్య శిబిరాలు

### 180 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

### వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో



**తొలి సమయంమహబూబాబాద్/మరిపెడ, జూలై 28:**
మహబూబాబాద్ జిల్లామరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలో రెండు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అబ్బాయిపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని దారావత్ తండా గ్రామపంచాయతీతో పాటు, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో ఈ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు వంటి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రక్తపోటు, మధుమేహం, మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రెండు శిబిరాల్లో కలిపి మొత్తం 180 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దారావత్ తండా సర్పంచ్ దారావత్ తేజ, హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, ఆరోగ్య సిబ్బంది అనిత, సౌజన్య, శ్రీదేవి, స్వప్న, ఆశా కార్యకర్తలు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విజయలక్ష్మి నగర్‌లో బాలల గ్రామసభ నిర్వహణ



**తొలి సమయం, ఇల్లందు;జులై, 28:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బాలల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలల గ్రామసభ నిర్వహించడం ఆనందంగా ఉందని, చిన్నారులతో మమేకం కావడం సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ప్రతి బాలుడు విద్యార్థిగా ఉండాల్సిన అవసరం ఉందని, విద్యను అభ్యసించడం ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదువుకోవడంతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఆటలు పిల్లల మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పోషకాహారం అందిస్తోందని, అలాంటి పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు గుర్తించి అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉపసర్పంచ్ రేణుక, వార్డు సభ్యులు హరిసింగ్, సదా, సాజన్య, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పౌర సేవలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యం



### ఇల్లందు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 28:**
పట్టణాల సమగ్ర అభివృద్ధి, పౌర సేవలను మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక శాఖ (సీడీఎంఏ) సంయుక్తంగా గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈ ఎస్ సి ఐ) పురపాలక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా పౌర సేవల నాణ్యతను మెరుగుపరచడం, పట్టణాల్లో ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, సమర్థవంతమైన పరిపాలనపై నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. తడి-పొడి చెత్త వేరు చేసి నిర్వహించడం, ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్త సేకరణ, పారిశుధ్య పనుల పర్యవేక్షణ, డీఆర్‌సీసీ కేంద్రాల్లో చెత్తను శాస్త్రీయంగా వినియోగించి నాణ్యమైన సేంద్రీయ ఎరువుల తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పట్టణ ప్రణాళిక, ఆధునిక రహదారుల నిర్మాణం, కాలువల అభివృద్ధి, మురుగునీటి నిర్వహణకు సంబంధించిన ఇంజినీరింగ్ విధానాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. మున్సిపాలిటీల ఆర్థిక స్వయం సమృద్ధి కోసం ఇంటి పన్ను, నీటి పన్ను, వ్యాపార పన్నుల వసూళ్లను వార్డుల వారీగా సమర్థవంతంగా చేపట్టే వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం మాట్లాడుతూ, గచ్చిబౌలిలో నిర్వహించిన ఈ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక పరిపాలనా విధానాలు, నూతన సాంకేతికతను ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో అమలు చేసి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రావు, కౌన్సిలర్లు సైదు మియా, చిల్లా భారతి, రాధా కోరి, గోపగాని రాజు, రేఖ స్వరూప, గందే పద్మ, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, రంప రమ్య, నిరుడు ఉపేంద్ర, సోని బాయి కోరి, ఉల్లింగా విజయలక్ష్మి, ఎం.డి. జాఫర్, నీలపు రమేష్, కొర్లపాటి శివకిరణ్, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రే స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఎమ్మెల్యే క్వార్టర్స్ నందు కలియడం జరిగింది

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

### జంగాలపల్లిలో నలుగురిపై కేసులు నమోదు



**తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026**
గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంగారం మండలం జంగాలపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరాలపై గంగారం ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి జంగాలపల్లిలోని గుడుంబా తయారీ స్థావరాలపై తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీలో పాల్గొంటున్నట్లు గుర్తించిన జంగాలపల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గుడుంబా నిర్మూలనతో పాటు అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

## టీ.యూ.డబ్ల్యూ.జేహెచ్ 143 కొత్తగూడ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా సాదుల రాజు.. ప్రధాన కార్యదర్శిగా మైదానం శ్రీనివాస్



**తొలి సమయం కొత్తగూడ 28 జూలై 2026**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ.యూ.డబ్ల్యూ.జేహెచ్ - 143) కొత్తగూడ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సాదుల రాజు (సాక్షి), ప్రధాన కార్యదర్శిగా మైదానం శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షుడిగా రెహమాన్ (ఏబీఎన్), కార్యదర్శిగా రాగి ఉపేంద్రచారి (రాజ్ న్యూస్), కోశాధికారిగా బూర వెంకటేశ్వర్లు (ఈనాడు), ప్రచార కార్యదర్శిగా దేవులపల్లి రాజేష్ (వార్త) ఎన్నికయ్యారు. అలాగే కమిటీ సభ్యులుగా ఎం.డి. గౌస్ పాషా (సీవీఆర్ న్యూస్), ఎం. వెంకన్న (టీ.న్యూస్), హెచ్. రాము, ఇ. మహేందర్, సంతోష్ (టీవీ5), డి. అశోక్, సారంగపాణి తది తరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూత నంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఐక్యంగా పనిచేస్తా మని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వృత్తిపరమైన విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**తొలి సమయం, వనపర్తి, జులై 28**
కొడంగల్ మాజీ ఎం.ఎల్.ఏ పట్నం. నరేందర్ రెడ్డ మాతృమూర్తి పట్నం. రుక్కమ్మ ఇటీవల మరణించారు. వారి స్వగ్రామం షాబాద్ నందురుక్కమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి గౌరవ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రుక్కమ్మ గారి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. గౌరవ నిరంజన్ రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే మర్రి. జనార్ధన్ రెడ్డి మరియు పార్టీ ప్రతినిధులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తెలంగాణ ఉద్యమకారుడు మీసాల వెంకటయ్య మృతి

### భౌతికకాయానికి నివాళులర్పించిన ఉద్యమకారుల ఫోరం నాయకులు



**తొలి సమయం, బయ్యారం; జూలై, 28:**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, బయ్యారం మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టి. యు. ఎఫ్) ఉపాధ్యక్షుడు మీసాల వెంకటయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. వెంకటయ్య భౌతికకాయాన్ని మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండల తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. తెలంగాణ ఉద్యమంలో వెంకటయ్య చేసిన సేవలను నాయకులు స్మరించుకుంటూ, ఆయన మరణం ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సోమారాపు వీరాస్వామి, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి, బయ్యారం మండల టి .యూ. ఎఫ్. అధ్యక్షుడు అడిదెల వీరభద్రం, ప్రధాన కార్యదర్శి గుండగాని రామానాదం, గుండాల శ్రీనివాస్, సాంబయ్య, షేక్ దస్తగిరి, అల్లం వెంకన్న, అలవాల సారయ్య, ఆవుల లింగయ్య, మాదిరెడ్డిఅనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## బెస్ట్ సోషల్ సర్వీస్ నంది అవార్డు అందుకున్న ఇల్లందు కౌన్సిలర్ దండు సారయ్య



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 28:**
ఇల్లందు పట్టణ 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య సామాజిక సేవా రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక బెస్ట్ సోషల్ సర్వీస్ నంది అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా ప్రదానం చేశారు. ప్రజా సేవనే పరమావధిగా భావిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడంతో పాటు వివిధ సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న దండు సారయ్యకు ఈ గౌరవం దక్కడం ఇల్లందు పట్టణానికి గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దండు సారయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత అంకితభావంతో ప్రజా సేవలో కొనసాగుతూ, సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. దండు సారయ్యకు లభించిన ఈ అవార్డు ఆయన సామాజిక సేవలకు దక్కిన గుర్తింపని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభినందించారు.

## జలసిరితో భవిష్యత్ తరాలకు నీటి భద్రత: సర్పంచ్ గుండెల రేణుక

### జంగిలిగొండలో జలసిరిపై గ్రామసభ




**తొలి సమయం,**
మహబూబాద్ మండలం జంగిలిగొండ గ్రామపంచాయతీలో తెలంగాణ జలసిరి కార్యక్రమంపై గ్రామసభను గ్రామ సర్పంచ్ శ్రీమతి గుండెల రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండెల రేణుక మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడం, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం, వర్షపు నీటిని సమర్థవంతంగా సంరక్షించడం, సుస్థిర జల నిర్వహణను సాధించడమే జలసిరి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. "జల సంరక్షణ మన సంరక్షణ" అనే నినాదంతో ప్రతి గ్రామంలో నీటి భద్రతను కల్పించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేసేందుకు ఇంకుడు గుంతలు ఎంతో అవసరమని తెలిపారు. వ్యవసాయ భూముల్లో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ప్రతి పొలానికి పంటగుంటలు, నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఊటకుంటలు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరమని వివరించారు. ప్రతి కుటుంబం, ప్రతి రైతు నీటి సంరక్షణలో భాగస్వాములై జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ గుండెల రేణుక కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుగులోతు రాములు, వార్డు సభ్యులు కొయ్యల కొమురెల్లి, ఇరుగు రమేష్, రత్నపురం సునీత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ స్నేహ శబరిష్



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 28**
జిల్లా ప్రిన్సిపల్ డిస్టిక్ సెషన్స్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ కె.మురళీమోహన్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసారు అదేవిధంగా పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు..

## ఛత్రపతి సాహు మహరాజ్ స్ఫూర్తితో బి.సి హక్కులు సాధించాలి



### భారత్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాస్ రామ్ నాయక్

### హైదరాబాద్‌లో ఘనంగా రిజర్వేషన్ దినోత్సవం

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 28**
బ్రిటిష్ పరాయి పాలనలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించి సకల అసమానతలను రూపుమాపడానికి కృషి చేసిన ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తితో బి.సి ప్రజల హక్కులు సాధించాలని భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షులు దాస్ రామ్ నాయక్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిఎంపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ అధ్యకతన ఆదివారం జరిగిన రిజర్వేషన్ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 80 సంవత్సరాలుగా ఈ దేశ పాలకులు దళిత బహుజన ప్రజలను అన్ని రకాలుగా అణచివేస్తున్నారని, ఓట్లు మనవి అయినా సీట్లు మనవి కాకుండా పోతుందని, దేశ ప్రజలకు వాస్తవ చరిత్రను, అణచివేత క్రమాన్ని తెలిపి చైతన్యం చేస్తున్న బామ్ సెఫ్ జాతీయ అధ్యక్షులు వామన్ మిశ్రాఫ్ నాయకత్వంలో అందరం కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. బామ్ సెఫ్ ఉద్యమాన్ని నీరు గార్చడం కోసం కాంగ్రెస్, బిజెపి పార్టీలు చాలా కుట్రలు చేస్తున్నారని అన్నారు. దేశంలో తీవ్ర అణచివేత వల్ల అణగారిన వర్గాల్లో తిరుగుబాటు వస్తుందని ఆ తిరుగుబాటును పక్క దారి పట్టించే కుట్రలు పాలకవర్గ పార్టీలు చేస్తున్నాయని అన్నారు. దేశ ప్రజల్లో అసమానతలకు కారణమైన బ్రాహ్మణిజాన్ని బహుజన వాదంతో ఎదురించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పునాదులు వేసిన సాహు మహారాజ్ స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు ఎస్సీ, ఎస్టీ, ఒబిసి లు ఐక్యతతో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ జె శాంసన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన సాహు మహారాజ్ స్ఫూర్తితో స్థానిక సంస్థలతో పాటు, చట్టసభల్లో బి.సి ల వాటా సాధించాలని అన్నారు. 1990 లో మండల్ కమీషన్ ను వ్యతిరేకించిన బిజెపి నేటికి బి.సి జనగననకు, బి.సి రిజర్వేషన్లకు అడ్డుపడుతుందని, బి.సి లకు బిజెపి ప్రధాన శత్రువు అనే విషయాన్ని తెలియజెప్పాలని అన్నారు. సాంప్రదాయం, దేశ భక్తి, సనాతన ధర్మం పేరుతో బి.సి లను ఓటు బ్యాంక్ గా వాడుకొని అధికారంలోకి వస్తూ మళ్ళీ ఆ బి.సి ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. బి.సి రిజర్వేషన్లకు అడ్డు పడే న్యాయ వ్యవస్థలో బి.సి లకు రిజర్వేషన్లు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. బిఎంపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక న్యాయానికి సాహు మహారాజ్ పాలనని, కొల్లాపూర్ సంస్థానంలో సాహు పాలన నుండి ఎన్నో విధానాలను తీసుకొని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచారని అన్నారు. ఆధునిక భారతదేశ తొలి రిజర్వేషన్ సృష్టికర్త సాహు మహారాజ్ తన సంస్థానంలో అన్ని సామాజిక వర్గాల ప్రజల జనాభా దామాషా ప్రకారం సకల సామాజిక రంగాల్లో సమాన హక్కులు కల్పిస్తూ అందరికీ రిజర్వేషన్లు అందించిన సాహు మహారాజ్ తన పట్టాభిషేకం నాడు జరిగినటువంటి అవమానాన్ని గమనించి ప్రజలంతా స్వాభిమానంతో జీవించే పాలన కోసం ఎన్నో సంస్కరణలు చేశారని, పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ అమలులో భాగంగా అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి సి జాక్ రాష్ట్ర చైర్మన్ కోల జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ వితంతువుల వివాహాలు, మహిళలకు విద్య , పేదలకు గురుకుల పాఠశాలల ఏర్పాటు లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి నేటి బహుజన సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంపి జాతీయ ఉపాధ్యక్షులు ముక్తి మహమ్మద్, బిఎంపి నాయకులు వి ధర్మయ్య, శాంతి, వేణుగోపాల్, పటేల్, బూక్యా రాజు, కుమార్, రవితేజ వివిధ సంఘాల నాయకులు దాసరి అజయ్ కుమార్ యాదవ్, సాయిని నరేందర్, ఎన్ జె శాంసన్, కోల జనార్ధన్ గౌడ్, పి శంకర్ తదితరులు పాల్గొన్నారు

## రైతులు నీటి వసతి ఆధారాన్ని బట్టి పంటలు వేయాలి

### - అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### రైతు నేస్తం వందవ వీడియో కాన్ఫరెన్స్ ఎపిసోడ్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు






**తొలి సమయం మహబూబాబాద్ జూలై 28**
పట్టణంలోని రైతు వేదిక కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నిర్వహించిన 100వ రైతు నేస్తం కార్యక్రమాన్ని మహబూబాబాద్ మండలంలోని రైతు వేదిక కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా మహబూబాబాద్ మండలంలోని రైతులు మరియు వ్యవసాయ అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు నీటి వసతి ఆధారంగా పంటలు వేసుకోవాలని, ప్రభుత్వ ప్రోత్సహించే అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ పంప్ పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం తగ్గుతుందని, వరికి బదులుగా ఆరుతడి పంటలైన వేరుశనగ పెసర మినుము కూరగాయలు పంటలు సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ జిల్లాలోని జయ్యారం గ్రామంలో ఆయిల్ ఫాం పంట సాగు చేస్తూ అధిక లాభాలను పొందుతున్న రైతు వల్లూరి కృష్ణారెడ్డి ద్వారా వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుండి వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి .గోపి , వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ పాల్గొన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని రైతు వేదిక కార్యాలయం ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ విజయచంద్ర, జిల్లా ఉద్యానవనాధికారి జినుగు మరియన్న, మహబూబాబాద్ డివిజన్ ఏ డి ఏ అజ్మీర్ శ్రీనివాసరావు, ఏవో టెక్నికల్ రాంజీ, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణంలో వేగం పెంచాలి

### - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 28**
యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి అనుమతులు చేసి ప్రారంభించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఎర్రకుంట తండా, బొద్దిగొండ, కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామాలలో రెండు పాఠశాలలు మంజూరు కాగా ఒక్కో స్కూలుకు 200 కోట్ల చొప్పున 400 కోట్ల నిధులతో జిల్లాలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి అట్టి పనులను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అనేది తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్మాత్మక విద్యా కార్యక్రమం. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాల రెసిడెన్షియల్ విద్యను అందించడం. కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి చొప్పున యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యం. ప్రతి పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు బోధన ఉంటుందని అన్నారు. ఒక్కో పాఠశాలలో సుమారు 2,560 మంది విద్యార్థులకు వసతి, విద్య అందించేలా రూపకల్పన ఆధునిక తరగతి గదులు, సైన్స్ & కంప్యూటర్ ల్యాబ్స్, డిజిటల్ లెర్నింగ్, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్, భోజనశాల వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. మొదటి దశలో బాలికల పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, పేద మరియు గ్రామీణ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల స్థాయి నాణ్యమైన విద్య అందించడం. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య మరియు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేయాలని, వాటితో పాటు విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ పెట్టుబడులను ప్రణాళికలో పెట్టింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఈడబ్ల్యుసి ఇంజనీర్ అరుణ్ కుమార్, గూడూరు, కురవి తహసిల్దారులు విజయ, కోమల, ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల దరఖాస్తులు డివిజన్ జెఎసికి అందజేత



**తొలి సమయం ప్రతినిధి: కేసముద్రం/(మహబూబాబాద్), జూలై 29;**
కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారుల జాబితా కోసం మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న 63 మంది ఉద్యమకారుల దరఖాస్తులను మహబూబాబాద్ డివిజన్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ కు మహబూబాబాద్ లో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిఖార్సైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా, ప్రతి ఒక్క ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలము మరియు నెలకు 25 వేల రూపాయల ఫించన్ ఇప్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కేసముద్రం మండల అధ్యక్షులు చాగంటి కిషన్, మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి యువజన జెఏసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్,ఉద్యమకారులు కీర్తి సమ్మయ్య, జనిగల పరమేశ్వర్, తరాల విజయ్ పాల్గొన్నారు.

## పాత పల్లిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కలెక్టర్ పరిశీలన



**తొలి సమయం పెద్బేరు జూలై 28**
డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ వేగంగా పూర్తి చేసేలాచర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం గృహాల పనులను పరిశీలించి నిర్మాణాల పురోగతిని సమీక్షించారు ఈ సందర్భంగా నిర్మాణాల ప్రస్తుత స్థితినిఅధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 48 గృహాలు స్లాబ్ దశలో ఉండగా, మరో 2 గృహాలు బేస్‌మెంట్ దశలో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పనులు ఎప్పటి వరకి పూర్తవుతాయనే అంశంపై కాంట్రాక్టర్‌తో మాట్లాడిన కలెక్టర్, నిర్ణీత గడువులోగా అన్ని గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల వేగాన్ని మరింత పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులకు సంబంధించిన బిల్లులు త్వరితగతిన విడుదలయ్యేలా జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిర్మాణాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించిన కలెక్టర్, అధికారులు కూడా పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని ఆదేశించారుఈపరిశీలనలో హౌసింగ్ పీడీ విటోభా, సంబంధిత శాఖ అధికారులు, పీ ఆర్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, స్థానికులు తదితరులుపాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి వనపర్తి ద్వారా జారీ

దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
బుధవారం । 29 । జూలై । 2026

## అంకితభావానికి గుర్తింపు: జగదీశ్వర్ రెడ్డికి ఉత్తమ రైతు అవార్డు




**తొలి సమయం పెబ్బేరు జులై 28**

పెబ్బేర్ రైతు నేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, అత్యధికసార్లుకార్యక్రమానికి హాజరై వ్యవసాయ రంగంపై తనకున్న ఆసక్తి, అంకితభావాన్ని చాటుకున్న పెబ్బేర్‌కు చెందిన రైతు శ్రీ పి. జగదీశ్వర్ రెడ్డికి ఉత్తమ జిల్లా రైతు పురస్కారం ప్రదానంచేశారు.వ్యవసాయంపై నిరంతర అధ్యయనం, ఆధునిక సాగు విధానాల పట్ల ఆసక్తి, రైతు నేస్తం కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యం కారణంగా ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఆయనకు లభించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, మిత్రులు జగదీశ్వర్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషి మరెందరో రైతులకు స్ఫూర్తిగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ గౌరవం పెబ్బేర్ ప్రాంత రైతాంగానికి గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు.

## చిట్యాల గ్రామంలో రూ.15 లక్షల సీసీ రోడ్డు శంకుస్థాపన

### పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి



**తొలి సమయం పెద్ద వంగర జూలై 28**

పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పాలకుర్తి శాసన సభ్యురాలు యశశ్విని రెడ్డి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలగిపోతాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ, నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ , మహమ్మద్ రహీం మాజీ ఎంపిటిసి గ్రామ పార్టీ అధ్యక్షుడు వల్లపు కుమారస్వామి వార్డు మెంబర్లు మండల నాయకులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు గ్రామస్థులు పాల్గొని అభివృద్ధి పనుల ప్రారంభాన్ని స్వాగతించారు.

## అఫిఫా బేగం కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**తొలి సమయం పెబ్బేరు జులై 28**

డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గారి ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణ కేంద్రానికి చెందిన ఆఫీఫా బేగం, కుటుంబ సభ్యులు గఫార్ గారికి 15,000/- రూ విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.కుటుంబ సభ్యులు జిల్లెల చిన్నరెడ్డి గారికి గౌని బుచ్చారెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ముస్తాక్ పాతపల్లి చంద్రశేఖర్, ఎండీ ఖాజా శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యం



### టీం సంభవ ఫౌండేషన్ సేవలు అభినందనీయం: కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి

**తొలిసమయం, బూర్గంపాడు, జులై 28 :**

మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో టీం సంభవ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి అన్నారు. మంగళవారం టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం బత్తులనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చర్ల మండలంలోని కొండివాయి, ముల్కలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 120 మంది విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, జ్యామెట్రీ బాక్సులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుదాబాయి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి చేయూతనిస్తూ భవిష్యత్తుకు బాటలు వేస్తున్న టీం సంభవ ఫౌండేషన్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. టీం ఫౌండేషన్ వాలంటీర్ రూప్లా నాయక్ మాట్లాడుతూ, భవిష్య



త్తులో కూడా మారుమూల ప్రాంతాల్లో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ఎక్కువ మంది విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణసాగర్ సర్పంచ్ తాటివాణి, ఉప సర్పంచ్ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సపావత్ బాలకృష్ణ చౌహాన్, ఎఫ్ఎల్ఎన్ జిల్లా మానిటరింగ్ మేనేజర్ అల్లూరి రెడ్డి, మండల రిసోర్స్ పర్సన్ జగన్, ఉపాధ్యాయులు భాస్కర్, సీఆర్పీ శారద, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు రజిత, సమ్మయ్య, నరేష్, రామకృష్ణ, మల్లేశ్వరి, రాము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత

### టీమ్ సంభవ ఫౌండేషన్ ద్వారా రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేసిన మెహర్ ప్రకాష్

**తొలిసమయం, ఖమ్మం, జులై 28 :**

ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తూ, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న గిరిజన విద్యార్థినికి టీమ్ సంభవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మెహర్ ప్రకాష్ రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల, ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసిన జి. శృతికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో మాలిక్యులర్ బయాలజీ విభాగంలో ప్రవేశం లభించింది. అడ్మిషన్ కోసం రూ.24,750 ఫీజు చెల్లించాల్సి ఉండగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని బూర్గంపహాడ్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు రూప్లా నాయక్ ద్వారా తెలుసుకున్న మెహర్ ప్రకాష్, టీమ్ సంభవ ఫౌండేషన్ తరఫున వెంటనే స్పందించి విద్యార్థిని శృతికి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థిని శృతి మెహర్ ప్రకాష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

# జీవో-76కు బ్రేక్ పడిందా?

### పట్టాల కోసం కొత్తగూడెం పేదల నిరీక్షణకు తెర పడేది ఎప్పుడు ?

### జీవో 76 అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

### బిఆర్ఎస్ నాయకులు సంకుబాపన అనుదిప్ డిమాండ్




**తొలిసమయం, కొత్తగూడెం, జులై 28 :**

బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకుని వచ్చిన జీవో ఎంఎస్ నెం.76 అమలు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, కొత్తగూడెం నియోజకవర్గంలోని పేదలకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి సంబందించి శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు సంకుబాపన అనుదిప్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 76 ద్వారా ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి మార్గం సుగమం చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ జీవో అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలన్నారు.శాసనసభ ఎన్నికల సమయంలో కొత్తగూడెం పేదలకు ఇండ్ల స్థలాలు, గృహ హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆ తర్వాత కార్పొరేషన్ ఎన్నికల సమయంలో రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా మళ్ళీ హామీను ఇచ్చినప్పటికీ ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జీవో 76 కింద కొత్తగూడెం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశారో, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను విడుదల చేయాలని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికల సమయంలో 100 రోజుల్లో జీవో 76 కింద పట్టాలు అందిస్తాం అని హామీ ఇచ్చారని, అయితే రెండున్నరేళ్లు గడిచినా ఆ హామీ అమలు చేయడంలో విఫలమాయ్యారని విమర్శించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి జీవో 76 అమలుకు స్పష్టమైన గడువు ప్రకటించాలని కోరారు. జీవో అమలుకు పరిపాలనా లేదా న్యాయపరమైన అడ్డంకులు ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు నిర్దిష్ట కాలపట్టిక ప్రకటించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జీవో ఎంఎస్ నెం.76 ప్రస్తుతం అమలులో ఉందా? లేక నిలిపివేశారా? అమలులో ఉంటే ఇప్పటివరకు ఎంతమందికి లబ్ధి చేకూరింది? నిలిపివేసి ఉంటే అందుకు గల కారణాలేమిటి? కొత్తగూడెం ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఎప్పుడు అందిస్తారు? అనే ప్రశ్నలకు ప్రభుత్వం అధికారికంగా సమాధానం ఇవ్వాలని కోరారు.జీవో 76 అమలు స్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, కొత్తగూడెం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నిర్దిష్ట గడువులో ఇండ్ల స్థలాల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగరాజు రాజేష్, బత్తుల శ్రీనివాస్, అహ్మద్, గుమ్మడి సాగర్, కలకోటి ఐలయ్య, గాదం రాజేందర్, కాసోజు రామాచారి, న్యాయవాది రాధాకృష్ణ, మున్నా, పిక విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.